సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



నమస్తే అక్కా : ఇసుకతోట వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

7

బంగారు కొండవయ్యా.. మా జగన్ మావయ్యా..







కంచరపాలెం వద్ద జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే వెన్నుతట్టి.!

- జనజాతరతో హోరెత్తిన విశాఖ నగరం
- అడుగడుగునా నీరా'జనం'.. దారిపొడవునా అలుపెరగని స్వాగతం
- సాగరతీరంలో మార్మోగిన జై జగన్ నినాదం
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం జగన్
- ఎండకు సైతం వెరవని అభిమానం
- పెందుర్తి, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో సాగిన బస్సుయాత్ర
- ఎండాడలో రాత్రి బస



భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థాంక్యూ సీఎం సార్



మండుటెండ.. అయినా భయపడలేదు.. కారుమబ్బులు.. అయినా కదలలేదు.. చిరుచీకట్లు.. అయినా వెరవలేదు.. అదే అభిమానం.. అదే ఆదరణ.. ఓ నాయకుడి జైత్రయాత్రకు విశాఖ నగరం సాక్ష్యంగా నిలిచింది. అభిమానం అంటే ఇలా ఉంటుందా? జనమంతా ఏకమై సంబరం చేస్తే ఇంత సందడిగా ఉంటుందా.? అన్నట్లుగా నగరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర సాగింది. సంక్షేమం, అభివృద్ధితో జనహృదిని గెలుచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాగరతీరంలో జన సముద్రం అంబరమంత స్వాగతం పలికింది. జై జగన్ నినాదాలతో సాగర ఘోషను మించి విశాఖ నగరం ప్రతిధ్వనించింది. బాధలతో కలిసిన వారికి సీఎం జగన్ భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారి కన్నీళ్లు తుడిచారు. సంతోషంతో వచ్చిన వారితో సందడి చేశారు. సుమారు 45 కిలోమీటర్ల మేర అభిమానంతో వచ్చిన జన సందోహాన్ని చిరునవ్వుతో పలకరించి.. అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

సాక్షి, విశాఖపట్నం:

జనమే జనం.. పోటెత్తిన అభిమాన ప్రవాహం.. కిక్కిరిసిన రహదారులు.. రోడ్లకిరువైపులా జనం బారులు.. మహిళల హారతులు.. పూల వర్షాలతో కనీవినీ ఎరుగని అఖండ స్వాగతం నడుమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం'బస్సు యాత్ర ఆదివారం విశాఖ నగరంలో 45 కిలోమీటర్ల మేర సాగింది. సంక్షేమ రథసారథి, పేదల పెన్నిధి, తమకు మంచి చేసిన జననేతను స్వయంగా చూసేందుకు పెద్దల నుంచి పిల్లల దాకా ప్రతి ఒక్కరూ మండుటెండను సైతం లెక్క చేయకుండా వెల్లువలా తరలివచ్చారు. అభిమాన నేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ఉత్సాహం చూపారు. తన కోసం వేచి చూస్తున్న అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి ఆప్యాయంగా పలకరించారు. వారి కష్టాలు తెలుసుకుని 'నేనున్నానంటూ' భరోసా కల్పించారు.

పినగాడిలో పోటెత్తిన అభిమానం

పెందుర్తి నియోజకవర్గం పినగాడి జంక్షన్‌లో జాతీయ రహదారి నిండిపోయింది. కాన్వాయ్ కదిలేందుకు కూడా వీలులేకుండా జనం సీఎం జగన్‌కు జేజేలు పలికేందుకు బారులు తీరారు. అభిమానంతో ఉరకలెత్తుతున్న ప్రజలను చూసి బస్సు దిగిన వైఎస్ జగన్.. జనానికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జై జగనన్నా.. దుష్ట చతుష్టయంతో పోరాటానికి మేమంతా సిద్ధమంటూ మహిళలు నినదించారు. అక్కడి నుంచి కాస్తా ముందుకు వచ్చిన వెంటనే పినగాడి ప్రజలు సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వగ్రామమైన శ్రీరాంపురంలో మహిళలు సీఎం జగన్‌కు దిష్టి తీశారు. మేహాద్రిగెడ్డ, లక్ష్మీపురం, వరలక్ష్మీనగర్.. ఇలా ప్రతి చోటా జనం ప్రభంజనంలా కదిలివచ్చారు.

వేపగుంటలో జన వర్షం

వేపగుంటకు చేరుకున్నాక బస్సుయాత్ర.. జైత్రయాత్రలా మారింది. లక్ష్మీపురం నుంచి వేపగుంట జంక్షన్ నలువైపులా.. జయహో జగన్ అంటూ అభిమానులు.. జగనన్నా అంటూ మహిళలు.. సీఎం సీఎం అంటూ యువత కేరింతల నడుమ యాత్ర సాగింది. బస్సుపైకెక్కిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడి నుంచి గోపాలపట్నం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎటు చూసినా జన సందోహమే కనిపించింది. మిట్ట మధ్యాహ్నం నడినెత్తిన సూరీడు భయపెట్టిస్తున్నా.. జనం కదలకుండా జగన్‌ని చూసిన తర్వాతే వెళ్లారు. వాహనాల్లో వెళ్లే వారు జగన్‌కు అభివాదం చేస్తూ సంబరపడ్డారు.

అభిమానంతో జంక్షన్ జామ్

పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం రైతు బజారు వద్ద మధ్యాహ్నం 1.15 గంటలకు లంచ్ విరామం తీసుకున్నారు. సాయంత్రం 3.30 గంటలకు మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో మొదలైంది. మేమంతా సిద్ధం కటౌట్లతో ప్రజలు సీఎం రాక కోసం ఎదురు చూశారు. బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు రెండు వైపులా రహదారులు, దుకాణాల వద్ద సంక్షేమ ప్రదాతను చూసేందుకు పోటీ పడ్డారు. బస్సు వెంట నడుస్తూ ముందుకు సాగారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. అప్పటివరకు భయపెట్టిన ఎండవేడి నుంచి ఉపశమనం దక్కడంతో జనం మరింతగా పోటెత్తారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ వినూత్నంగా కరాసాలో క్రేన్ ద్వారా భారీ కటౌట్‌ను గాల్లో ఉంచుతూ సీఎంకు స్వాగతించారు.



గోపాలపట్నం వద్ద మేమంతా సిద్ధం అంటున్న జనం

'ఉత్తరం' ఉప్పొంగింది

ఉత్తర నియోజకవర్గంలోకి రాగానే జన ప్రభంజనం వెల్లువెత్తింది. బస్సుపైకెక్కి సుమారు 4 కిలోమీటర్ల మేర ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ అభివాదం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ యువత ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపింది. 2019లో ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా కంచరపాలెం మెట్టు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తరహాలో కంచరపాలెం మెట్టు కిక్కిరిసిపోయింది. మూడు వైపులా దారులన్నీ జనంతో నిండిపోయాయి. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో 101 గుమ్మడి కాయలతో సీఎం జగన్‌కు దిష్టి తీశారు.

'దక్షిణం' దద్దరిల్లింది

తాటిచెట్లపాలెం మీదుగా దక్షిణ నియోజకవర్గంలోని రైల్వే న్యూకాలనీలోకి బస్సుయాత్ర అడుగుపెట్టింది. సీఎం జగన్ రాకతో వెల్లువలా తరలివచ్చిన ప్రజలతో దక్షిణం దద్దరిల్లిపోయింది. జై జగన్ నినాదాలు మిన్నంటాయి. దొండపర్తి జంక్షన్ నుంచి ప్రజలకు సీఎం జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పువాయిద్యాలతో దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సీఎంకు స్వాగతం పలికారు.

తూర్పులో జనసాగరం

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. వాహనమిత్రతో లబ్ధి పొందిన సుమారు 500 మంది ఆటోడ్రైవర్లు సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటుకుంటూ 'ఆటో హారం'తో స్వాగతం చెప్పారు. బాణసంచా మిరుమిట్ల మధ్య తూర్పులో యాత్ర వైభవంగా సాగింది. ముఖ్యమంత్రిని చూసేందుకు కుటుంబాలతో కలిసి ప్రజలు రోడ్లపైకి వచ్చి.. మురిసిపోయారు.



పినగాడి వద్ద సీఎం జగన్ అభివాదం

భీమిలి నియోజకవర్గంలో రాత్రి బస

హనుమంతువాక మీదుగా విశాఖ వ్యాలీ జంక్షన్, జూపార్క్, మధురవాడ ఎండాడ వరకు బస్సు యాత్ర సాగింది. వైఎస్ రాజశేఖర రెడ్డి క్రికెట్ స్టేడియం సమీపంలో రాత్రి బస పాయింట్‌కు చేరుకుంది. ఇక్కడ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. వేలాదిగా తరలివచ్చిన జనం సంక్షేమ సారథిపై పూల వర్షం కురిపించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేసేలా కార్యనిర్వాహక రాజధానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్ సార్.. మళ్లీ మీరే రావాలి.. అంటూ ముక్తకంఠంతో నినదించారు. ఎంపీ అభ్యర్థులు బొత్స ఝాన్సీ, బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు బస్సుయాత్రలో పాల్గొన్నారు.

నేనున్నానని..



దివ్యాంగ బాలుడికి భరోసా ఇస్తున్న సీఎం జగన్,





బాధితుడి సమస్య వింటూ.. దివ్యాంగ సోదరులకు అండగా..

అదే ఆప్యాయత





అమ్మా.. అంతా కుశలమేనా : మహిళలతో మాట్లాడుతున్న సీఎం జగన్

ఆటోగ్రాఫ్..



చిన్నారికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న సీఎం జగన్

స్వీట్ మెమొరీ



సీఎంతో సెల్ఫీ తీసుకుని మురిసిపోతున్న ఓ కుటుంబం

మరింత అప్రమత్తత అవసరం

నిఘా బృందాలకు ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్ సూచన

అనంతగిరి: పోలింగ్ ముగిసే వరకు నిఘా బృందాలు అప్రమత్తం ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్ ఆదేశించారు. ఆదివారం అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని డముకు, జైపూర్ జంక్షన్ వద్ద ఉన్న నిఘా బృందాల పనితీరును పరిశీలించారు. ఎస్ఎస్‌టీఎఫ్ఎస్‌టీ బృందాల నిఘాను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించి వీడియోలు చిత్రీకరించాలని ఆయన ఆదేశించారు. మద్యం, నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి అక్రమ రవాణాతోపాటు సంఘ విద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. వీటిపై సీ–విజిల్‌కు ఫిర్యాదులపై ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు హాజరై, వంద నిమిషాల్లో సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సూచించారు.



నిఘా బృందాలకు సూచనలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్

వైభవంగా దొంగలదోపు ఉత్సవం

- శాస్త్రోక్తంగా నిర్వహించిన అర్చకులు
- భారీగా తరలివచ్చిన భక్తజనం



విద్యుత్ కాంతులతో కొండపై ఆలయం

వీఆర్‌పురం: ఏజెన్సీ భద్రాద్రి శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారికి పావన గోదావరినదిలో దొంగలదోపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఈ ఉత్సవాన్ని ఆదివారం తెల్లవారుజాము ఒంటి గంటకు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రేవు బాలరాజు, ఈవో లక్ష్మీకుమార్ ఆధ్వర్యం వహించారు. కొండ మీద ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం ఉత్సవమూర్తులను దేవరాజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదావరి నదిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడి నుంచి ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి దొంగల దోపు ఉత్సవం నిర్వహించారు. అక్కడి ఉత్సవమూర్తులకు కొండపై వసంతోత్సవం నిర్వహించారు. గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించేందుకు తగినంత నీరు లేనందున నడి ఒడ్డున శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ వేడుకలను వీక్షించేందుకు వీఆర్‌పురం మండలంతో పాటు కూనవరం, చింతూరు, వెలేరుపాడు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎటపాక సీఐ దానేటి రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



కొండ కింద మండపంలో స్వామివారికి దొంగల దోపు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్





జిల్లాలోని రంపచోడవరం అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, అరకు అసెంబ్లీకి రేగం మత్స్యలింగం సోమవారం నామినేషన్లను దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.

8లో

క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 26 వరకు గడువు

చింతపల్లి రూరల్ : అర్హత ఉన్న ప్రతిఒక్కరు పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు ఈనెల 26లో దరఖాస్తులు అందజేయాలని తహసీల్దార్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామకృష్ణ తెలిపారు. ఫారం 12 తో పాటు ఓటర్ ఐడీ కార్డు, ఉద్యోగి ఐడీ, ఎన్నికల డ్యూటీ ఆర్డర్ జెరాక్స్ కాఫీలను జతచేయాలని సూచించారు. వాటితో పాటుగా ఓటరు వరుస సంఖ్య, చిరునామా, పిన్‌కోడ్ వివరాలను దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.

రోగులకు డాక్టర్ తనూజారాణి పరామర్శ



కేజీహెచ్‌లో రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ తనూజారాణి

మహారాణిపేట(విశాఖ) : అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతీ సర్పంచ్ పూజారి మేరీ, అదే పంచాయతీకి చెందిన డుంబేరి స్వప్నను వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందజేయాలని తెలిపారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఏపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అచ్యుతాపురం: రామన్నపాలెంకు చెందిన ధర్మిరెడ్డి శ్రీను(42) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. సీఐ బుచ్చిరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మిరెడ్డి శ్రీను తన ఇంటి ముందు గల రేకుల షెడ్‌కు విద్యుత్ వైర్లు అమరుస్తుండగా షాక్‌కు గురయ్యాడు. అతనిని అచ్యుతాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి శ్రీను మృతి చెందినట్టు నిర్ధారించారని సీఐ చెప్పారు. శ్రీనుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్కాచెల్లెమ్మలదే విజయం

- ఘనంగా బడ్డు సంబరం
- తరలివచ్చిన గిరిజనం
- పాత పాడేరులో థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడి

సాక్షి, పాడేరు : జిల్లా కేంద్రమైన పాత పాడేరులో బడ్డు సంబరం అంబరాన్నంటింది. గిరిజనుల ఆచార వ్యవహారాలకు అద్దంపట్టేలా ఇటుకల పండగలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన ఉత్సవానికి మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. వీరి ఆరాధ్యదైం శంకులమ్మకు, కొండపై ఉన్న పురాత దేవతామూర్తుల విగ్రహాలకు గిరిజన పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను గ్రామచావిడి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పోటా పోటీగా థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు.

ఉత్సాహంగా గొడుగుల సంబరం

గొడుగుల సంబరం మరింత ఉత్సాహంగా సాగింది. పలు వేషాలతో గిరిజనులు సందడి చేశారు. అడవిలో సేకరించిన బడ్డు తాడులను గ్రామ చావడి సమీపంలోనే కట్టి అక్కడ కూడా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బడ్డుతాడును అక్క చెల్లెమ్మలు ఒక పక్క.. వివాహాలు చేసుకుని మెట్టినింటికి వెళ్లిన వదిన, మరదళ్లు మరోపక్క బొడ్డుతాడును పోటాపోటీగా లాగారు. అక్కచెల్లెమ్మలు విజయం సాధించారు. సంబరం అనంతరం విందు భోజనాలు నిర్వహించారు. సంబరానికి పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరయ్యారు. ఆయనకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. వారితో కలిసి థింసా నృత్యం చేశారు.



బడ్డు తాడు లాగుతున్న అక్కాచెల్లెమ్మలు, వదిన మరదళ్లు



బడ్డు తాడుకు పూజలు చేస్తున్న గిరిజనులు



గ్రామచావిడిలో గిరిజన మహిళల థింసా నృత్యం

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్

- రంపచోడవరంలో నాగులపల్లి ధనలక్ష్మి..
- పాడేరులో అరకు అభ్యర్థి రేగం మత్స్యలింగం

రంపచోడవరం: రంపచోడవరం అంసెబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 7 గంటలకు అడ్డతీగల మండలం ఎల్లవరం నుంచి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు) ఆధ్వర్యంలో నామినేషన్ వేసేందుకు బయలుదేరతారు. అడ్డతీగల నుంచి సీతపల్లి సెంటర్, గంగవరం మీదుగా రంపచోడవరంలో పందిరిమామిడి జంక్షన్‌కు ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి పాదయాత్రగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారు. మార్గం మధ్యలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అక్కడ నుంచి ర్యాలీ అంబేడ్కర్ సెంటర్ మీదుగా సుమారు 3 కిలోమీటర్లు పాదయాత్రగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. నియోజకవర్గంలోని 11 మండలాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు, వైఎస్సార్ సీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు హాజరుకానున్నారు.

అడ్డతీగల: రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఎమ్మెల్సీ అనంతబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 7 గంటలకు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అరకు నుంచి ర్యాలీగా..

అరకులోయ రూరల్: అరకు అసెంబ్లీకి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ శ్రేణులతో అరకులోయ ర్యాలీగా పాడేరు బయలుదేరుతామన్నారు. పాడేరు ఐటీడీఏలో రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్

- టీడీపీకి చెందిన వార్డు మెంబర్ సుబ్బారెడ్డి అనుచరులతో చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్సీ అనంతబాబు

మారేడుమిల్లి : రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దూడ సుధాకర్ వైఎస్సార్‌కాంగ్రెస్‌లో చేరారు. మండలంలో చట్లవాడ గ్రామానికి చెందిన ఆయనకు అడ్డతీగల మండలం ఎల్లవరంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయనతో అనుచరులు 50 మంది పార్టీలో చేరారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. టీడీపీకి చెందిన వార్డు మెంబర్ నల్లమిల్లి సుబ్బారెడ్డి 30 మంది యువకులతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ అనంతబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



దూడ సుధాకర్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు

- అప్పన్న వైభవాన్ని కీర్తించిన పండితులు
- వేణుగోపాల స్వామిగా దర్శనమిచ్చిన నృసింహుడు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం పండిత సదస్సును ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి, దేవేరులతో కలిపి వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రధాన దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వారి వైభవాన్ని చాటిచెప్పారు. అనంతరం దేవస్థానం తరఫున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి వారిని సత్కరించారు. రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వర్ణకవచ అలంకారంలో అప్పన్న

కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆదివారం స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ గురువారం మాత్రమే చేసే స్వర్ణ కవచ అలంకారాన్ని, ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్యం రోజు కూడా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 7 గంటల నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని ఘనంగా నిర్వహించారు.



పండిత సదస్సు నిర్వహిస్తున్న అర్చకులు



వేణుగోపాలస్వామి అలంకారంలో గోవిందరాజస్వామి

అరకులోయలో భారీ వర్షం

అరకులోయ రూరల్: మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు, ఎదురు గాలులకు స్థానికులు భయాందోళనల చెందారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలో ఆదివారం ఉరుములతో కూడిన వర్షం పడింది. మండల కేంద్రంలో భారీ చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



అరకులోయ సినిమా హాల్ రోడ్డులో వంతెనపై నిలిచిన వర్షపు నీరు

వివాహిత బలవన్మరణం

- కత్తితో గొంతు కోసుకుని మృతి
- మనస్పర్థల కారణంగా భర్తకు దూరం
- ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- మృతురాలు ఉమాదేవి తాటిపూడి ఏపీఆర్‌జేసీలో లెక్చరర్

అనకాపల్లి: వివాహిత గొంతు కోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మనస్తాపం వల్లే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. మండలంలో కొత్తూరు పంచాయతీ ముత్రాస్ కాలనీకి చెందిన గుత్తికొండ ఉమాదేవి విజయనగరం జిల్లా తాటిపూడి ఏపీఆర్‌జేసీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఆమె అనకాపల్లి నుంచి విధులకు వెళ్లి వస్తున్నారు. ఈమెకు 2011లో ముత్రాసు కాలనీకి చెందిన ఆర్మీ ఉద్యోగితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఇది జరిగిన కొన్నాళ్లకు మనస్పర్థల కారణంగా వారిద్దరు విడిపోయారు. అప్పటినుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కత్తితో గొంతుకోసుకుని మృతి చెందింది. దీనిపై మృతురాలు ఉమాదేవి తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



గుత్తికొండ ఉమాదేవి (ఫైల్)

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. **వివరాలిలా..**

- సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు(08845) స్పెషల్ రైలు ప్రతి శుక్రవారం సంత్రగచ్చిలో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 9.02 గంటలకు బయలుదేరి ఆదివారాల్లో తెల్లవారు 2 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రగచ్చి(08846) స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో ప్రతి ఆదివారం తెల్లవారు 3.15 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ చేరుకుని.. అక్కడి నుంచి 8.57 గంటలకు బయలుదేరి సోమవారాల్లో ఉదయం 10.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు జూన్ 28 వరకు నడుస్తాయి.
- కోయంబత్తూర్-బరౌని (06059) స్పెషల్ రైలు ప్రతి మంగళవారం కోయంబత్తూర్‌లో ఉదయం 11.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 25 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో బరౌని-కోయంబత్తూర్(06060) స్పెషల్ బరౌనిలో ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మూడో రోజు తెల్లవారు 3.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి నాలుగో రోజు తెల్లవారు 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

యారాడ తీరంలో సినిమా సెట్

పెదగంట్యాడ: విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రానికి సంబంధించి యారాడ తీరంలో షూటింగ్ జరగనుంది. ఈ నెలాఖరు నుంచి ఇక్కడ షూటింగ్ ప్రారంభం కానుండటంతో తీరంలో వేసిన సెట్ పర్యాటకులను ఆకర్షిస్తోంది.



తీరంలో సినిమా షూటింగ్ కోసం వేసిన సెట్

భారత్‌ను విశ్వగురువుగా నిలుపుదాం

- ఏఐసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్
- ఘనంగా భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

ఏయూ క్యాంపస్: భారతదేశాన్ని విశ్వగురువుగా నిలుపుదామని ఏఐసీటీఈ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. భారత్‌ని సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దడంలో ఆచార్యుల పాత్ర కీలకమన్నారు. భవిష్యత్తులో ఆర్ట్స్, సైన్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలు, కళాశాలలు, పాఠశాలల్లో సైతం ఈ అవార్డులను ప్రదానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్య, పరిశోధన రంగాలలో విశేష సేవలు అందించిన ఆచార్యులు, యాజమాన్యాలు, ప్లేస్‌మెంట్ అధికారులు, పరిశోధకులను సత్కరించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యువతకు నైపుణ్యాలే అవకాశాలు సృష్టిస్తాయన్నారు. ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించాలని చెప్పారు. బ్రెయిన్ ఓ విజన్ సంస్థ సీఈవో డి.గణేష్ నాగు మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 320 మంది ఆచార్యులు, కళాశాలల నిర్వాహకులు, ప్లేస్‌మెంట్ అధికారులు, పరిశోధకులను సత్కరించామన్నారు. విద్యార్థులే ఓటింగ్ విధానంలో వీరిని ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్వీస్ నౌ సంస్థ డైరెక్టర్ జి.భాస్కర్, సిటో హెల్త్ కేర్ సంస్థ సీఈవో ఎస్.వి.కృష్ణ ప్రసాద్, ధనేకు సంస్థ ప్రతినిధి డి.కె.ఆర్.కె.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు ప్రదానం చేస్తున్న బుద్ధ చంద్రశేఖర్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఘనంగా సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాల్లో పాల్గొన్న కళింగ వైశ్యులు

సింహాచలం: విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో సింహాచలం కొండదిగువ ప్రైవేటు కల్యాణమండపంలో కళింగ వైశ్యులకు సామూహిక ఉపనయాలు ఆదివారం జరిగాయి. 150 మందికి ఉపనయనాలు చేశారు. తొలుత వీరంతా కొండదిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి అక్కడి నుంచి పాత గోశాల వద్ద ఉన్న కల్యాణ మండపానికి వెళ్లారు. అక్కడ శాస్త్రోక్తంగా వారికి యజ్ఞోపవీతధారణ చేశారు. విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు తలను సాయిమోహన్, కార్యదర్శి భోగి ప్రవీణ్‌కుమార్, సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్,భోగి గణేష్, వరదరాజు, దేవరశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు



నృత్యప్రదర్శనలో కళాకారులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోవరోజు ఆదివారం స్వామివారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్టం పజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరికొంతమందికి గాయాలు

చింతపల్లి రూరల్: మండలంలో ఆదివారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో వ్యక్తి మృతి చెందగా మరికొంతమందికి మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొమ్మంగి నుంచి చింతపల్లి వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటో ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కొమ్మంగి గ్రామానికి చెందిన పనసల రామారావు (58) తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇలావుండగా నిమ్మపాడు సమీపంలోని కొరుకొండలో వారపు సంత ముగించుకుని చింతపల్లి వైపు వస్తున్న చేపల వ్యాన్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బలపం పంచాయతీ లవడంపల్లి గ్రామానికి చెందిన కొరాబు చిట్టిబాబు, కొరాబు చిన్నారావుకు గాయాలయ్యాయి. లోతుగెడ్డ పీహెచ్‌లో చికిత్స అనంతరం ఇద్దరిని పాడేరు ఆస్పత్రికి వైద్యులు తరలించారు.



మృతుడు రామారావు (ఫైల్)



చేపల వ్యాన్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి

జగన్ మళ్లీ సీఎం కావాలని..

- బస్సు యాత్రను అనుసరిస్తూ బైక్‌పై ఓ యువకుడి ప్రయాణం
- మండుటెండలో కాలికి చెప్పులు లేకుండా పయనం

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బస్సు యాత్రను అనుసరిస్తూ ఓ యువకుడు చేస్తున్న ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సీఎం జగన్ బస్సు యాత్రతో పాటు కొండంత అభిమానంతో రామిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి చేస్తున్న రాష్ట్ర వ్యాప్త బైక్ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తన బైక్ మొత్తం వైఎస్సార్‌సీపీ జెండా రంగులు,పార్టీ జెండాలతో పాటు తాను ధరించిన హెల్మెట్‌కు కూడా పార్టీ రంగులతోనే తయారుచేయించుకున్న అమర్‌నాథ్ రెడ్డి జగనన్న బస్సు యాత్రను అనుసరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నాడు.సీఎం జగన్ బస్సు యాత్ర కాన్వాయ్ రాక ముందే ఆ యువకుడు జగనన్న కోసం వేచి ఉన్న ప్రజల వద్దకు చేరుకుని ప్రచారం చేస్తున్నాడు. జగనన్నపై ఉన్న అపారమైన అభిమానంతో నెలకు రూ.40వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని సైతం తృణప్రాయంగా వదిలిపెట్టాడు. అంతే కాకుండా మండుటెండను సైతం లెక్కచేయకుండా చెప్పులు వేసుకోకుండా జగనన్నతో పాటు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు తన యాత్ర కొనసాగుతుందంటున్నాడు అమర్‌నాథ్‌రెడ్డి. తాను చేస్తున్న ఉద్యోగంతో పాటు ఇంటి దగ్గర భార్య,ఏడాదిన్నర పాపను కూడా వదిలిపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా జన ప్రభంజనంతో కొనసాగుతున్న బస్సు యాత్రలో తాను కూడా భాగస్వామిగా మారాడు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడమనేదే తన కోరికగా చెప్తున్నాడు.జగనన్న మళ్లీ సీఎం అయ్యేవరకు చెప్పులు వేసుకోనని ప్రతినబూనాడు.తన బైక్‌కు అమర్చిన చిన్న లౌడ్‌స్పీకర్‌తో వైఎస్సార్‌సీపీ ప్రచార గీతాలను వినిపిస్తూ తనవంతు ప్రచారాన్ని చేపడుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డితో కొందరు పార్టీ అభిమానులు సెల్ఫీలు తీసుకోవడం విశేషం.2014,2019 ఎన్నికల్లో కూడా ఇదే తరహాలో ప్రచారం నిర్వహించినట్టు అమర్‌నాథ్‌రెడ్డి తెలిపాడు.